**COMMUNIST PARTY OF INDIA (MARXIST)**
**Telangana State Committee**
M.B.Bhavan, H. No.1-1-60/2, RTC 'X' Roads, Hyderabad -20.
Ph. 040- 27665011 /12, Fax : 27665013, Email-cpimtelangana@gmail.com

ప్రచురణార్థం/ ప్రసారార్థం: తేది: 29.01.2022

# ఆర్టీసీ బస్సుల సంఖ్యను పెంచాలి
# కార్మికులకు ఇవ్వాల్సిన చెల్లింపులు తక్షణమే ఇవ్వాలి

ప్రజారవాణ సంస్థ అయిన ఆర్టీసీ విషయంలో లాభ-నష్టాల వైఖరిని రాష్ట్ర ప్రభుత్వం విడనాడి బస్సుల సంఖ్యను పెంచాలని, కార్మికులకు ఇవ్వాల్సిన బకాయిలను తక్షణమే చెల్లించే విధంగా ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకోవాలి. కార్మికుల పనిభారాన్ని తగ్గించి, ఉద్యోగ రక్షణ కల్పించాలని, రాష్ట్ర వార్షిక బడ్జెట్‌లో 2శాతం నిధులు కేటాయించి ఆర్‌టిసిని బలోపేతం చేయాలని సిపిఐ(ఎం) తెలంగాణ రాష్ట్ర కమిటీ ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నది.

ప్రతి రోజూ సుమారు కోటి మంది పేద, మధ్యతరగతి ప్రజలను తమ గమ్యస్థానాలకు చేర్చుతున్న ఆర్‌టీసీ విస్తరణపై రాష్ట్ర ప్రభుత్వం శ్రద్దపెట్టడం లేదు. సంస్థను క్రమంగా బలహీనపరుస్తూ నష్టాల్లోకి నెడుతున్నది. రియంబర్స్‌మెంట్స్ సకాలంలో ఇవ్వడంలేదు. ఆర్టీసీ కార్మికుల పీఎఫ్ డబ్బులను కూడా వాడుకుంటున్నది. రిటైర్డ్ కార్మికుల చెల్లింపులు ఆపివేసింది. పెన్షన్, సిసిఎస్ లోన్‌ల జాప్యం చేస్తున్నది. సర్వీస్‌లో ఉండి చనిపోయిన సుమారు 600 మంది కార్మిక కుటుంబాలకు ఇన్స్యూరెన్స్ డబ్బులు చెల్లించలేదు. నాలుగేళ్లకోసారి జరగాల్సిన వేతనసవరణ కూడా రెండు దఫాలుగా పెండింగ్ పెట్టింది. 5 విడతల డీఏను నిలుపుదల చేసింది.

రాష్ట్రంలో 12,765 గ్రామ పంచాయితీలు ఉంటే కేవలం 9,377 గ్రామ పంచాయితీలకు మాత్రమే బస్సు సౌకర్యం ఉంది. 3,388 గ్రామ పంచాయితీలకు బస్ సౌకర్యం లేదు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్ పరిస్థితి ఘోరంగా తయ్యారైంది. 2019లో 3,700 బస్‌లు నడుపుతుంటే ఆర్‌టిసి సమ్మె అనంతరం 2020 జనవరిలో 800 బస్‌లు తగ్గించారు. ఇటీవల కాలంలో రీ-షెడ్యూల్ పేరుతో సర్వీసులను ట్రాన్స్‌ఫర్ చేస్తూ వున్న డిపోలను తగ్గిస్తున్నారు. కార్మికులపై పని భారం పెరగడం, కాలం చెల్లిన బస్సులను నడుపుతూ తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారు. ఆర్‌టిసిలో ట్రేడ్ యూనియన్ల కార్యకలాపాలపై నిషేధం పెట్టింది. 2 సంవత్సరాలు గడిచినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం వైఖరిలో ఎలాంటి మార్పు కనబడడంలేదు.

ప్రజల ఇబ్బందులను దృష్టిలో వుంచుకొని హైదరాబాద్, జిల్లాల్లో బస్సుల సంఖ్యను పెంచాలని, కార్మికుల హక్కులకు రక్షణ కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎం) కోరుతున్నది.

**(తమ్మినేని వీరభద్రం)**
రాష్ట్ర కార్యదర్శి